# పాలిగిన్నె - పెరుగూఅన్నం

అనుభవాన్ని ఆధారం చేసుకుని ఎంతోమంది జీవితాన్ని గురించి ఎన్నోరకాల అభిప్రాయాలు యిచ్చారు. నాటినుంచి నేటివరకూ కూడా అనేక కథకులు తమతమ కథల్లో జీవితాన్ని చిత్రవిచిత్రంగా చిత్రించారు. కాని స్థూలంగా ఆలోచిస్తే రెండేరెండురకాల అభిప్రాయాలు ఈ మొత్తం సాహిత్యంలోనూ ప్రతిబింబిస్తున్నయ్. 'ఒకటి—జీవితం అశాశ్వతం, క్షణికం అనీ— రెండు — అనుభవనీయమేకాని, వర్ణనీయం కాదు' అనీ!

జీవితం క్షణికం, అశాశ్వతం అని జీవితాన్ని అనుభవించకుండానే పరాజితులైపోయారు కొందరు. మరి కొందరు "అయ్యో! క్షణికమే!" అని ఏక్షణాని కాక్షణం అనుభవించడానికి ఆవురావురుమని సిద్ధపడ్డారు.

దేన్ని నమ్మినవారికి జీవితం దాన్నే ప్రసాదించింది.

ఏదారిని అనుసరించిన వారు ఆదారిని అట్లానే వెళ్లిపోయారు. అయితే ఈ కథలోని వరుణగానీ, శంకరంగానీ ఒకే సిద్ధాంతాన్ని విశ్వసించినవారుకాదు, ఒకే దారిన నడిచినవారు కాదు. కాని నడవాలనీ— విశ్వసించాలనీ తమ తమ శక్తికొద్దీ పాటుపడ్డారు. జీవితం చెట్టాపట్టా లేసుకుని సుఖాన్ని అనుభవించడానికి శాయశక్తులా తాపత్రయపడ్డారు. ఆమేరకు ఆలోచిస్తే, వాళ్లిద్దరిలోనూ ఏలోపమూ లేదు. కాని అనుభవించేరోజా— సుఖపడే గీతా— స్పష్టంగా కనిపించినట్టే కనిపించి—అంతలోనే అంతర్ధానమైపోయింది. అలా కావడానికి సామాజిక కారణాలేవిటో వాళ్లకు తెలుసు. కాని ఈ సామాజిక కారణాలతోనే అందరూ—కాకపోతే కొందరైనా తమ సుఖాలకు తిలోదకా లిస్తున్నారా! అనడిగితే, దాదాపు లేదనే సమాధానం వస్తుంది. ఒక్కో సందర్భంలో సంఘాన్నీ, కుటుంబాన్నీ త్యజించి తమ సుఖాన్నే లక్ష్యంగా పెట్టుకుని జీవితాన్ని అనుభవించిన వారున్నారు. అలాంటి సందర్భంలో వాళ్లను "చరిత్ర హీనులుగానూ, స్వార్థపరులుగానూ" సంఘ నాయకులు చిత్రించారు, చెప్పారు, ప్రచారం చేశారు.

అది నమ్మిన వాళ్లు సంఘ శ్రేయస్సునూ, కుటుంబ శ్రేయస్సునూ దృష్టిలో పెట్టుకుని తమ జీవితాలను ఆమేరకు "కుదింపు" చేసుకున్నారు. ఆ విధంగా చేసుకోవడంవల్ల వాళ్లకు లభించిందేవిటో అదే ఈ కథలో

*జీవితం ఒక బృహత్ గ్రంథం. కుదించి మదింపు వేస్తే లాభమా, నష్టమా? ఏమైనా, కోరిన ఫలం ఇస్తుందా పద్ధతి ......*





వీరమల్లు రామకృష్ణ

వరుణకూ, శంకరానికీ లభించింది. ఇంత మాత్రంచేత మనం "వాస్తవానికి" పట్టాభిషేకం చేశామనుకోవడం కంటే, ఆత్మవంచన ఈ పృథ్విమీద మరొకటి ఏదీ లేదేమో అనిపిస్తుంది. ఎంచేతా? అనే ప్రశ్న ఎటుగూడీ మీరు అడుగుతారు; అంచేతనే ఉన్నదున్నట్లు చెప్పేస్తాను.

* * * *

విజయపురికి దక్షిణంగా వెళ్ళే రైలుమార్గంలోనే రంగా మహాశయుడు పుట్టి పెరిగిన వూరుంది. ఆవూరికి పశ్చిమంగా మరో పది మైళ్ళు బండీ కట్టించుకుపోతే, 'మన్నవ' చేరవచ్చు. ఆ బండీ ఐనా అవూరి బయట పంట కాలువ వరకే! ఆ కాలువ మీద ఈ నాటికీ సరైన వంతెన లేదు. వెదురు కర్రలతోనూ, అంతకంటే బలమైన సర్వీ బాదులతోనూ కట్టిన అంతంతమాత్రం వంతెనే— ఆ వూరికీ, బయటి ప్రపంచానికీ సంబంధం కలిగిస్తుంది. ఆ వంతెన దగ్గరే బండి దిగి వూళ్ళోకి పదడుగులు కాలినడకన పోవాల్సిందే! ఆ వూరు మొత్తమంతా కలిపి నగరంలో ఓ పేటకంటే చిన్నది. ఆ వూరికి ఈ నాటికీ కంకరరోడ్లు లేవు. వర్షాకాలం మోకాటిలోతు బురద. ఇహ ఆకాలంలో ఆడవాళ్ళ మంచినీటి అవస్థ అంతాయింతా కాదు. కావడి భుజాన్న పెట్టుకుని బిందెతో నీళ్ళు చేరవేసే మొగాళ్ళున్న యిళ్ళయితే తప్ప, బద్ధంకించే వాళ్ళంటే,—యిహ ఆడవాళ్ళ గతి ఆ పరమాత్మకే తెలియాలి. అలాంటి గ్రామంలోనే శివరామయ్యగారనే గృహస్థు తన తమ్ముళ్ళతోనూ, భార్యా పిల్లలతోనూ సలక్షణంగా బ్రదుకుతున్నాడు. మొత్తం వున్న ఐదుగురన్నదమ్ముల్లోనూ శివరామయ్య పెద్దవాడు. అందరికంటే చిన్నవాడు శంకరం.

అతనికి మాత్రమే వివాహం కాలేదు. మిగతా వారందరికీ తలా యిద్దరు ముగ్గురు పిల్లలు కూడా పుట్టారు. పిల్లాజెల్లాతోనూ, దీర్ఘ కాలం నిలవ వుండిపోయే బంధువుల సంసారాలతోనూ ఆ కుటుంబం బయటి వాళ్ళకు చూసేందుకు చిన్న సత్రంలా వుంటుంది. పిత్రార్జితం తాలూకు పన్నెండెకరాల పొలం, యిప్పుడు వీళ్ళంతా కాపురం వుంటున్న పధ్నాలుగంకణాల లోగిలి—యిదంతా కూడా సమిష్టి కుటుంబం క్రిందే వుంది. అందరికంటే పెద్దవాడైన శివరామయ్య వాస్తవంగా చాలా శాంత స్వభావం కలవాడు. కాస్తంత స్థూలం శరీరం. ఇంటా బయటా అన్ని విషయాల్లోనూ ఆయన మాటే చివరి మాట. కాని రెండో ఆయన, మూడో ఆయన కొంచెం దుడుకు స్వభావం కలవాళ్ళే అయినప్పటికీ—శివరామయ్యగారు వ్యవహార దక్షుడూ, అనుభవజ్ఞుడూ కావడం చేత సమిష్టి కుటుంబంలో ముఖ్యంగా ఆడవాళ్ళ మూలంగా ఉత్పతిల్లే సమస్య లన్నిటినీ ఏదో విధంగా సర్దుకు వచ్చేవాడు. బావగారంటే మరదళ్ళకు ఎంత గౌరవం— భయం అంటే,— ఈ మనస్పర్ధలు ఆయనదాకా పోతున్నాయనీ తెలిస్తేనే— వాళ్ళల్లో వాళ్ళే సిగ్గుతో కుమిలిపోయేవాళ్ళు! అతిథి సత్కారాల విషయంలో ఇహ 'నా' వాళ్ళు 'నీ' వాళ్ళు అనేభేదం మచ్చుకు కూడా కనిపించదు. స్థూలంగా చెప్పాలంటే ఆయింట్లో నిత్యకల్యాణం జరుపుతూ, పచ్చ తోరణం కడతారు. కాని అన్నిటికంటే విచారించవలసిందీ— బాధించే విషయమేమిటంటే—శివరామయ్య భార్య సుభద్రమ్మ ఐదేళ్ళనుంచీ మంచాన పడేవుంది. ఆవిడకు మొదటి సంతానంగా మొగపిల్లవాడు పుట్టిన ఆరేళ్ళకు ఆవిడ మంచ మెక్కింది. అంతే; మళ్ళీ ఈనాటికీ అడుగు క్రింద పెట్టలేదు. ఆవిడ రోగానికి ఏయే డాక్టర్లు ఎన్నెన్ని పేర్లు పెట్టిందీ అదంతా చిత్రమైన కథ. వైద్య శాస్త్రంలో పెద్ద పెద్ద పట్టాలు పుచ్చుకొన్నవారు సైతం తమ శక్తికొద్దీ పాటుపడ్డారు కాని యిది 'క్షయ' తప్ప మరొకటి కాదనీ,— శానిటోరియంలో చేర్పడం కంటే గత్యంతరం లేదనీ చేతులు కడుక్కున్నారు.

శానిటోరియంలో వైద్యం కోసం కొండంత డబ్బు పోశాడు శివరామయ్య. ఆరోగ్యం కుదిరినట్లు కనిపిస్తే డాక్టర్ల సలహా మీదే యింటికి తీసుకొచ్చాడు. కాని యింటికొచ్చిన ఆర్నెల్ల తరువాత అంతకంటే ఉధృతంగా మళ్ళీ ముంచుకొచ్చింది. రెండవ

సారి పోయినప్పుడు "యిహ యిప్పట్లో అవకాశం లేదనీ— బయటే వైద్యం చేయించమనీ" డాక్టర్లు త్రిప్పి పంపారు. వీలున్నపుడు మళ్ళీ మేమే తెలియజేస్తామన్నారు. కాని, ఈనాటికీ అలాంటి అవకాశం వున్నట్లు వాళ్ళు తెలియ జేయలేదు.

ఇదంతా చూసిన కొంతమంది భూత వైద్యులు అది అసలు క్షయే కాదనీ— నాలుగు పూజలతో ఆ రోగాన్ని రూపుమాపేస్తామనీ—అనేక ఉదాహరణలతో చెప్పారు. వరదలో కొట్టుకొని పోయే వాడికి ఏదిదొరికినా ఎట్లా ఘనంగా భావిస్తాడో—శివరామయ్య కూడా అల్లాగే భావించేవాడు. రకరకాల వైద్యంతో విసుగెత్తిపోయిన శివరామయ్య ఎవరు ఏ చిటికవేసి చెప్పినా నిజమే ననుకునేవాడు. చివరకు ఆ భూతవైద్యుల వల్ల కూడా కాలేదు. చిత్రమేమిటంటే—శివరామయ్యకు ఆనాటి వరకూ అలౌకిక శక్తుల మీద ఏదైనా విశ్వాసం వుంటే అది కాస్తా మట్టగొట్టుకు పోయింది. దానివల్ల ఆయనకు చెడు కంటే మంచే జరిగిందని చెప్పవచ్చు. చివరకు ఆయన నిర్ధారణ చేసుకొని ఏది ఏమైనా కానిమ్మని, దక్షిణవైపు గది ఖాళీచేసి అందులోనే సుభద్రమ్మకు ప్రత్యేకంగా పడకా, తిండీ ఏర్పాటు చేశాడు. 'క్షయ' అనే అభిప్రాయంతోనే దానిక్కావలసిన ముఖ్యమైన ఏర్పాట్లన్నీ చేశాడు. తనవాళ్ళలోనే తను దూరంగా వుంచబడినప్పుడు ఆవిడ అంతరాత్మ ఎంత ఘోరంగా రోదించిందో— సర్వాంతర్యామికే తెలుసు. ఆ గదిలో ఏకాంతంగా పడుకుని తన చివరి దినాలు లెక్క పెట్టుకోవడం మినహా ఆమెకు మరో ధ్యాసే లేదు. తన వ్యర్థ వల్ల తన బిడ్డకే అపకారం జరిగేప్పుడు ఏ తల్లి అయినా తన బిడ్డను ఎందుకు కావలించుకుంటుంది. కాని, శివరామయ్యమాత్రం తనపిల్లవాడికి తల్లి మూలంగా లభించే ఆనందాన్ని ఏమాత్రం దూరంచేయలేదు. పరిస్థితుల ప్రభావానికి లొంగి కర్మ సిద్ధాంతాన్ని మనసా వూహించుకుని స్థిమితపడ్డాడు. అందువల్ల ఆయనకు మానసికంగా ఎలాంటి ఆత్మ శాంతి లభించిందో చెప్పలేం! ఇంట్లోని తోడి కోడళ్ళు కూడా—యింటి పెద్ద కోడలికి ఎన్ని మాట పట్టింపులున్నా — సేవాశుశ్రూషలు చెయ్యడంలో ఏమాత్రం లోపం చేసేవాళ్ళు కాదు. ఇది వాస్తవంకూడాను. ఆ యింటి వ్యవహారాలు స్వయంగా చూసిన వాళ్లెవరూ కూడా ఈ విషయంలో ఎలాంటి పొరపాటూ పడరు. సరిగ్గా యిలాంటి పరిస్థితిలోనే వైశాఖ మాసపు మిట్టమధ్యాహ్నపువేళ శివరామయ్య మేనమామ సంగమేశ్వరయ్య తన

# పాలగిన్నె- పెరుగూ అన్నం

ఏకైక పుత్రికను వెంటబెట్టుకుని మండుటెండ కాలుతున్న మట్టి రోడ్డుమీద చాలా ప్రయాస పడి యింటికి చేరాడు. అసలే మిట్ట మధ్యాహ్నం. ఆడవాళ్ళంతా పని ముగించుకొని మధ్య యింట్లో 'పరమపద సోపానం' ఆడు తున్నారు. మగవాళ్ళు ఆ గదిలో ఒకళ్ళూ, యీ గదిలో ఒకళ్ళూ నిద్రపోతున్నారు. శంకరం దక్షిణపు మరో గదిలో చదువు కుంటున్నాడు. శివరామయ్య మాత్రం వీధి వరండాలో నులకమంచం మీద తన స్థూల శరీరానికి కాస్తంత విశ్రాంతి నిచ్చాడు. చెమటతో తడిసి ఆయనకు నిద్రపట్టడం లేదు. అలాంటి సమయంలోనే తన గుమ్మంలోకే వస్తున్న మేనమామను చూచి చాలా ఆదరంగా ఆహ్వానించి, యింట్లోవాళ్ళ నుద్దేశించి, "ఒసే! సరోజినీ, మామయ్య ఒస్తున్నాడే, కాళ్ళకు నీళ్ళు పట్రా!" అని కేక వేశాడు.

మేనమామ కాస్తంత సేద తీర్చుకొని పిల్లదానిక్కూడా కాస్తతుండుగుడ్డతో ముఖం తుడిచి లోపలికి పంపించాడు. ఆడవాళ్ళంతా ఒక్కొక్కరే వచ్చి ఆయన్నుద్దేశించి, "ఏం బాబాయ్! చాలా కాలానికి వచ్చావు. పిన్ని పోయింతరువాత రావడమే మానేశావు?" అని పరామర్శ చేశారు. భోజనానికి లేవమని పట్టు బలవంతం చేశారు. కాని సంగమేశ్వ రయ్య, "నా కిప్పు డేమీ అవసరం లేదు,— సాయంత్రం తింటాను" అన్నాడు. పిల్లదాన్ని మాత్రం వాళ్ళు లోపలికి తీసుకుపోయి, యించక్కా పరామర్శచేసి పీటవేసి యింత భోజనం పెట్టారు.

సంగమేశ్వరయ్య భార్య కొంతకాలం క్రితమే చనిపోయింది. ఆయ నెక్కడో లంకలో కాపురముంటున్నాడు. పూర్వం యింత బాగా వున్నవాడే అయినా అవివేకంతో ఆస్తి తగలేశాడు. ఫలితంగా ఈనాడు నిరాధార స్థితి—చివరకు కట్టుకున్న భార్య కూడా గతించింది. ఆవిడ కన్న కూతురే యిప్పుడు ఈయన వెంట వచ్చిన అమ్మాయి. రానురాను ఆయనకు మతి స్థిమితం కూడా తగ్గింది. ఎప్పుడూ ఏదో చెయ్యాలనే తపనా, ఆలోచనా తప్ప ఏదీ నెరవేరదు. చివరకు దినసరి తిండికూడా పెద్దసమస్యగా తయారైంది. అలాంటి స్థితిలోనే యిప్పు డిక్కడకు చేరాడు. మరో రెండు మూడు రోజులు తర్వాత సందర్భవశాత్తూ శివ రామయ్య నుద్దేశించి, "ఇదో శివయ్యా! నువ్వేమీ అనుకోకుండా వుంటే,— నా మన సులో సంగతి ఒకటి చెబుతాను. ఏమంటావు?" అ నడిగాడు సంగమేశ్వరయ్య.

శివరామయ్య మేనమామవేపు చూసి, "అదేమిటి మామయ్యా అట్లా అంటావు. నే నెప్పుడైనా నీ విషయంలో చెడుగా అను కున్నానా?" అన్నాడు సహజంగానే !

"లేదనుకో! నాకే ఎందుకో జంకుగావుంది. అయినా నువ్వు అభయ మిస్తున్నావు గనుక యిక నాకు ఏ చింతా లేదు. ఉన్న సంగ తేమిటంటే మీ అత్తయ్య పోయినదగ్గర్నుంచి నాకు మనసేమీ బావులేదు. ఆ పిల్లదాన్ని పెట్టుకుని, ఆ యింట్లోనూ, వూళ్ళోనూ వుండడానికే నాకు నచ్చడం లేదు.—అయితే నీ యింట్లోనే శాశ్వతంగా తిష్ఠ వెయ్యాలనే అభిప్రాయం నా కెన్నడూ లేదు. అనకూడదు గానీ—పదిమంది పిల్లా జెల్లాతో సుఖంగా వున్నవాడివి. భగవంతుని దయవల్ల మరో పది కాలాలపాటు అలాగే వుండాలి కూడాను"— ఒక్క క్షణం ఆగి, "నీ కుటుంబంలో పదిమందిలో ఒకర్తెగా పడివుంటుంది. ఆ పిల్లదానికి నీ నీడన యింత ఆశ్రయం దొరికితే—అంతే చాలు. ఏదో నీ చేతొస్తే దాన్ని ఒకింటిదాన్ని చేస్తే—యిక నీ ఋణం నేను ఏ విధంగానూ తీర్చుకోలేను" అని ఆగిపోయాడు.

ఓ క్షణం తర్వాత శివరామయ్య చిన్నగా నవ్వి, "యింతమాత్రానికి యింత కష్టెందుకు మామయ్యా! పోనీ వుండనీ,—మా పిల్లలతో పాటే అదీ తింటుందీ—వుంటుందీ. అది సరే గానీ—మరి నువ్వో" అ నడిగాడు.

మేనమామ నిట్టూర్పి—నొసలు కొట్టు కుంటూ, "భగవంతుడు నా ముఖాన ఎట్లా రాసిపెట్టాడో అల్లానే జరుగుతుంది. ఆ పిల్ల దానికి నీ దగ్గర ఆశ్రయం దొరికితే—నాకు జీవితంలో సగం భారం తీరినట్టే!" అన్నాడు నిశ్చింతగా నిట్టూర్చి. అయితే సంగమేశ్వరయ్య ఈ మాట ఏ లక్ష్యంతో అన్నాడో శివరామయ్యకు అర్థంకాలేదు—ఆ సమయంలో—ఆయన మన స్సులో శంకరం బొమ్మ మెదిలింది. ఇది

(తరువాయి 54 వ పేజీలో)

ఒకాయన తన పెంపుడు కుక్కను గురించి ఘనంగా చెప్పుతున్నాడు:

"మా ఇల్లు తగలబడ్డప్పుడు, అందరం సురక్షితంగా బయటపడ్డాం. కానీ మా కుక్కమాత్రం మళ్ళీ ఇంట్లోకి పరుగెత్తింది. అలా యింట్లోకి పోయి ఏం తెచ్చిందనుకున్నారు?"

"ఆ ఏం తెచ్చింది?" అని అడిగాడు మిత్రుడు.

"ఫైర్ ఇన్స్యూరెన్స్ పాలిసీ దాచిన కవరు తడి తువ్వాలు చుట్టబెట్టి."

[illegible]

అతని చుట్టూ సమాజంలో అతని మాట నెగ్గలేదు. అట్లా నెగ్గకుండా చేయగలగడం అతని చుట్టూవున్న సామాజికుల ప్రతిభ!

కాని చిత్రమైన సంగతేమిటంటే, 'వరుణ'నే రాజమ్మగారు పెళ్ళికూతురుగా నిర్ణయించింది! ఈ సంగతి విన్న క్షణాన వరుణ మనసు ఎంత కల్లోలపడిందో చెప్పలేం! తానింతకాలంగా వూహించుకున్న ఆశాసౌధాలు ఈనాటికీ విధంగా కూలిపోతాయనీ—తద్భిన్నంగా సజీవ సమాధితుల్యమైన జీవితం తన ముఖాన్న రాసిపెట్టి వుందనీ ఆమె ఏ విధంగానూ వూహించలేకపోయింది. ఇహ శంకరం వ్యవహారం మరీ అయోమయం.

ఒకటి రెండు రోజులు అసలు ఆకలిగా లేదని మొహం తప్పించుకున్నాడు. వరుణ తనకు వదిన కాబోతున్న సంగతి తెలిసినప్పట్నుంచీ ఆమె ముఖం చూడ్డానికే అతను మహా క్షోభపడిపోతున్నాడు. తలపుల్లోనే తన వివాహం జరుగుతుందని యింట్లో వాళ్ళంతా అనుకుంటూనే వున్నారు. ఇంతలోనే యిదంతా యిట్లా తారుమారైపోతుందని అతను మాత్రం ఎలా వూహించగలడు? అయితే తన అయిష్టాన్ని ఏవిధంగానూ వ్యక్తం చేయలేపోయాడు. కుటుంబంలోని వాళ్ళంతా ఒక శుభ కార్యాన్ని జయప్రదంగా నెరవేర్చేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నపుడు, తనొక్కడూ ఎదుర్కోనేందుకు సాహసం లేకపోయింది. 'వరుణ'లాంటి మనిషే నోరెత్తలేకపోయినపుడు—(?) తనమాత్రం ఎలా జోక్యం చేసుకోగలడు? అయితే వరుణ కూడా తనంత తానుగా యిందుకు అంగీకరించలేదన్న సంగతి ఆమె ముఖం చూస్తే ఎంత మూఢునికైనా చక్కగా తెలుస్తుంది. కాని సామాజికులు ఈ విషయాలకు ఏమాత్రం విలువ యిచ్చినట్టు కన బడదు. పనిలో పనిగా అన్నీ ఒక్కసారిగా జరిగిపోయేందుకు వీలుగా శంకరానిక్కూడా మరో సంబంధాన్ని రాజమ్మగారే స్వయంగా ఖాయం చేసుకొచ్చింది. రెండు రోజుల తేడాలో శంకరం వివాహం నవరంగపురంలో—సరోజినీ తోనూ—శివరామయ్య వివాహం యింట్లోనే—వరుణతోనే జరిగినయ్.

వివాహాలు చాలా జరుగుతుంటయ్. కానీ—యింత చిత్రమైన వివాహాలు మాత్రం చాలా అరుదుగా జరుగుతుంటయ్. శివరామయ్యను ఒక యింటివాణ్ణి చేశామన్న సంతృప్తి రాజమ్మలాంటి మనస్తత్వం కలిగిన సామాజికులకు కలుగుతుందేమోకాని, పరోక్షంగా వాళ్ళే మరొకరి జీవితాలకు నరరూప రాక్షసులుగాజియారాతారన్న నగ్నసత్యాన్ని ఎవరోగాని గుర్తించలేరు. ఈ వివాహ కాండవల్ల సామాజికుల దృష్ట్యా ఒక కుటుంబం కుదుట పడేవుండవచ్చు. కానీ పరోక్షంగా యిద్దరి జీవితాల్లో శాశ్వత సుడిగుండాలు ఏర్పడ్డాయన్న సంగతి ఎంతమంది గుర్తించివుంటారు? కుటుంబ గౌరవం దృష్ట్యా, సంఘ గౌరవం దృష్ట్యా—వరుణ ఆ యింటి పెద్ద కోడలే కావచ్చు — కానీ ఆమె అంతర్యంలో రేగుతున్న తుపానూ,—సముద్రపు హోరూ ఎంతమంది వినగలుగుతున్నారు? ఆ ఇంటికి కొత్తగా కోడలుగా వచ్చిన సరోజినికి తన స్థానంలో పూర్వం వరుణ వుండేదని తెలియడానికి ఆమెకు ఎంతోకాలం పట్టలేదు. ఆనాటినుంచీ ఆవిడ వరుణను అదో రకమైన దృష్టితోనే చూచేది. కాని వాస్తవంగా ఆవిడ అలా శంకిత దృష్టితో చూడ్డానికి కావలసిన సంగతేమీ లేదు కూడాను! కాని మానవసహజమైన స్వభావం అంత చప్పున మారిపోయేందుకు దాని చుట్టూ సమాజంకూడా అంత సంస్కారవంతమైనదికాదు. అయినా వరుణ ఇవేమీ లక్ష్యపెట్టలేదు. పూర్వంలాగా ఇప్పుడు ఇంటెడు చాకిరీ అయితే లేదుగానీ, అంతకు మించిన ఆవేదన ఆవిడను నిలువునా కాల్చుకు తింటున్నది. వయస్సులో తోటివాళ్ళందరికంటే చిన్నదైనా అధికారికంగా ఆమే ఆ ఇంటి పెద్ద కోడలు. తప్పనిసరై పరిస్థితులకు అనుగుణంగా మళ్ళీ ఆ ఇంటి తోడి కోడళ్ళంతా తమ తమ పనులు మళ్ళీ మళ్ళీ నడుంవంచి చేసుకోవడం ప్రారంభించారు. కాని ఈ మార్పువల్ల వరుణక్కవచ్చిపడ్డ సుఖమేమీలేదు. కాని అంతరాత్మ బాధ ఎవరితో చెప్పుకునేట్టు? పూర్వంలాగా శంకరానికి అన్నంపెట్టే సదవకాశం కూడా తన కీనాడు దక్కకుండాపోయింది. ఒకవేళ ధైర్యంతో చొరవ చేసుకోడానికైనా సంఘమూ, కుటుంబమూ, పరువూ, ప్రతిష్ఠ అడ్డువచ్చి గొంతుపిసికి కూర్చుంటయ్. నిన్నటివరకూ చేసినవనే ఈనాడు చేస్తే—సంఘమూ—తోడికోడళ్ళూ మొహాన్న వుమ్మేస్తారు. రేపు అనుభవించే సుఖాల వూహల మత్తులోనే గతమంతా గొడ్డుచాకిరీ చేసింది. ఆ విశ్వాసంతోనే బ్రతికింది. ఆ రోజు వచ్చినట్టే వచ్చి అంతలోనే అదిట్లా విషమంగా తయారయింది. రేపు లభించే అమృతం కోసరం—వర్తమానపు చేదును దిగమింగింది. కాని ఈనాడు తన జీవఫలం తనకే చేదుగా వుంది! భరించలేని వేదనా పుట్టెడు దుఃఖం. చెప్పుకునే దిక్కు లేదు. తల్లీ తండ్రీ అక్కచెల్లెళ్ళు లేకపోయినా—ఆ శూన్యజీవితంలోనే—ఎక్కడో కాస్తంత వెలుగు కనిపిస్తే—అదే మహాజ్యోతిగా వూహించుకొని, అంధ విశ్వాసంతోనే వెలుగు కోసరం నిర్విరామంగా పరుగులెత్తింది. తీరా గమ్యాన్ని చేరేసరికి, ఆ వెలుగు అంతర్ధానమైపోయింది. తనెక్కడుందో తనకే తెలియని అయోమయావస్థలో పడిపోయింది.

కాని శివరామయ్య ఇవేమీ అర్థంచేసుకునే స్థితిలో లేడు. అసలే భార్య గతించిన బాధ అతన్నింకా విడవలేదు. దానికితోడు వయస్సులో తనకంటే ఎంతో చిన్నదైన వరుణతో సాంసారిక జీవితంపట్ల అయనకు నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పడలేదు. అంచేతనే రాత్రి భోజనం చేయగానే ఏదో ఆలోచనలతో తన స్థూలశరీరానికి కాస్త విశ్రాంతి నిచ్చేవాడు. ఒంట్లో బాగాలేదంటే—కాళ్ళకు నూనె రాస్తూ, కాళ్ళు పిసుకుతూ కూర్చునేది వరుణ. ఆ స్వర్గసుఖంలో ఎప్పుడు కునుకు పట్టేదో శివరామయ్యకే తెలియదు. ఆ తరువాత నెమ్మదిగా లేచి నూనెసీసా అలమారలో పెట్టి అవతల మంచంమీద వరుణ పడుకునేది. కాని ఎంత ప్రయత్నించినా నిద్రపట్టేదికాదు. కడుపులో దుఃఖం ఎంత ప్రయత్నించినా ఆగేదికాదు. అవతల శంకరం గదిలోంచి వినిపించే సన్నని గాజుల ధ్వని, తలుపుతీసిన, వేసిన చప్పుళ్ళు స్పష్టంగా వినిపించేవి. ఎన్నోరకాల ఆలోచనలతోనూ, వ్యథలతోనూ కన్ను మూతపడేదికాదు. కాని, తొలి కోడి మాత్రం తన కూత మరిచేది కాదు.

వరుణ ఈ వ్యథను ఎంతోకాలం సహించలేకపోయింది. ఈ బాధను నివృత్తి చేసుకునేందుకు ఒకే వుపాయం కనిపించింది. అది వినా, అన్యథా శరణం నాస్తి! ఎన్నడూ భర్త అనురాగాన్ని పొందని యువతి; తన జీవితకాలంలో రేపు మంచిరోజు అనే విశ్వాసం లేనపుడు—ఏదో ఒకటి చెయ్యడానికి యత్నిస్తుంది. అలా చెయ్యడం కూడా ఒక విధంగా దోషమేమీ కాదు. కాని అప్రయత్నంలో అందరూ సఫలీకృతులు కాలేరు.

ఒకాయన వెండి రకం గడియారాన్ని మరమ్మత్తుకు దుకాణానికి తీసుకొని వెళ్ళాడు.

"అయ్యా, చిన్న పొరపాటు జరిగింది. చేతిలోంచి జారి క్రింద పడింది. ఏం చెడిపోయిందో చూడండి."

"పొరపాటు క్రింద పడటం కాదు. పడ్డదాన్ని తిరిగి మీరు తీసుకోవటం" అన్నాడు దుకాణం యజమాని.

# పాలగిన్నె—పెరుగూ అన్నం

కాని, ఈ సంగతి వరుణకు తెలియదు.

అప్రయత్నంగానే ఒక వెన్నెల రాత్రి మనసులో బాధ భరించలేక గదిలోంచి దక్షిణపువేపు పెరట్లోకి వచ్చింది. వెన్నెల పుచ్చపువ్వులా వుంది. కాని తనకంటే ముందుగానే వెన్నముద్ద పూలచెట్ల క్రింద రాతిమీద ఎవరో కూర్చున్నట్టు చూసి సహం భయంతోనే "ఎవరూ ?" అంది అదుర్దాగా.

"నేను" అన్నాడు శంకరం.

మనస్సు శాంతించినా, గుండెల్లో దడగానే వుంది. ఇట్లా అతను బయట ఒక్కడే కూర్చుని వుంటాడని ఆవిడ మొదట్లో వూహించలేదు. తనలాగే—లోలోపల దంహిచుకుపోతున్నాడని కూడా ఆమె గ్రహించలేకపోయింది. అనుకోకుండా వరుణ మరింత దగ్గరగా వెళ్లి "ఇంకా నిద్రపోలేదా ?" అ నడిగింది నెమ్మదిగా. క్రీనీడలో అతని ముఖం స్పష్టంగా కనిపించకపోయినా, వరుణ ముఖం మాత్రం ఆ వెన్నెల్లో శంకరం స్పష్టంగా చూడగలుగుతున్నాడు. శంకరం ఒక్క క్షణం ఆగి, "సరోజిని నిద్రపోతూనే వుంది, నేనే మెలుకువగా వుండిపోయాను" అన్నాడు. ఆ మాటల్లో బాధ ధ్వనిస్తూ వుంది. వరుణ మరింత నిశ్చింతగా శంకరం దగ్గరగా కాళ్లదగ్గిర కూర్చుని "నా నికృష్ట దరిద్రపు జీవితంలో ఇదొక్కటే మంచిరోజు బావా ! ఒక్క సంగతి నిన్నడగాలనుకుంటున్నాను. నిజం చెబుతావా ?" అంది వరుణ.

ఆమెలో ఇంత సాహసాన్ని చూడడం శంకరానికి ఇదే మొదలు. మొదట కొంత ఆశ్చర్యపడ్డా, తేరుకుని తనలాగే—ఆమె లోనూ జ్వాల మండిపోతూనే వున్నదని అర్థం చేసుకున్నాడు. ఆశ్రయం కోసరం వచ్చిన ప్రాణిన్ని వేటాడే స్వభావం అతనిలో లేదు. అందుచేతనే మరింత నెమ్మదిగా "ఏమిటి?" అన్నాడు. వరుణ ఒక్క క్షణం ఆగి, "నీకు జీవితం సుఖంగా వుందా బావా ?" అ నడిగింది.

శంకరం దీర్ఘంగా నిట్టూర్చి "నా సంగతలా వుంచు. నీ జీవితం బావుందా ?" అ నడిగాడు శంకరం.

ఆ మసకచీకట్లోనే ప్రయత్నపూర్వకంగా శంకరం ముఖంలోకి మరోసారి చూసి తల వంచుకొని—"పూర్వజన్మలో ఏ మహాపాపం చేశానో—నా కీ జన్మలో ఇంత క్షోభ నా మొహాన్న రాసిపెట్టాడు భగవంతుడు" పాలగిన్నె ముందుపెట్టి, పిల్లికి కాళ్లూ, నోరూ కట్టేస్తే—దాని కెంత 'హాయి' గా వుంటుందో నాకూ అట్లానే వుంది. కాకపోతే—పాలగిన్నె కళ్లముందు కనిపిస్తుందన్న ఆశ ఒక్కటే—నన్ను బ్రతికిస్తుంది. అదే లేకపోతే—" అని ఆగిపోయింది.

వరుణ హృదయంలోని జ్వాల అతనికి తగులుతూనే వుంది. దాని ఉపశమనానికి కావలసిన సాధనాలు నైతికవిలువలనే బంధనాల్లో ఇరుక్కుపోయినయ్. అందుచేత అసహాయుని లాగానే—"వరుణా ! నీలో ఇంత వేదనా, ఇంత సాహసమూ వున్నదన్న సంగతి ఇంకొంచెం ముందుగా తెలిస్తే ఎంత బావుండేది !" అన్నాడు శంకరం.

"వేదనా, సాహసమూ నాలో మొదట్నుంచీ వున్నయ్. లేనిదల్లా నీలోనే ! ఇట్లా అన్నానని నామీద కోపగించుకోకు బావా !" అని ఒక్క క్షణం ఆగి, "నేను నిన్ను ఇంత వరకూ ముట్టుకుని ఎరుగను. కాని ఈ రాత్రి ఇతరులు లేరు గనుక మొదటిసారిగా తాకి, శుక్రతార సాక్షిగా ప్రమాణంచేసి నిన్ను యాచించేది ఒక్కటే బావా ! నా జీవితంలో నిజంగానే సుఖపడేరోజు ఏదైనా వుందా ? నా బ్రతుకులో ఏదైనా మార్పు వస్తుందా ? ఉన్నదనీ, వస్తుందనీ నువ్వు మనసారా అభయమిస్తే,—ఆ రోజు కోసరం నా జీవితమంతా ఎదురుచూడగలను బావా " అంది. ఆ చివరిమాట అంటున్నపుడే ఆవిడ కంఠం రుద్ధమైపోయింది. క్షణం తర్వాత శంకరం తనను తాను సంబాళించుకొని "చూడు వరుణా ! అసంభవమైన విషయాన్ని గురించి నీకు అభయమిచ్చి నన్ను నేను మోసపుచ్చుకోలేను. గతంలో జరిగిపోయినదానికి, ప్రతిక్రియ అనేది, మన



శక్తికీ—నీతికీ అతీతమైన సంగతి. కణ్వాశ్రమంలో శకుంతల చేసిన పనిని హర్షించే ఈ లోకులే— మనం ఇట్లా కూర్చుంటే— దుమ్మెత్తిపోస్తారు. దానికి కారణం నేను చెప్పగలను కాని ఇంత చప్పున చెప్పడానికి, ఇంత రాత్రివేళ సాధ్యంకాదు. కాని ఒక మాత్రం నిజం. నైతిక విలువల్ని దృష్టిలో పెట్టుకున్నంతకాలం మన కీ యావజ్జీవ శిక్ష తప్పదు. ఆ విలువలకు స్వార్థంకోసరం తిలాంజలి ఇస్తే—శాశ్వతం అప్రతిష్ఠపాలవక తప్పదు" అన్నాడు శంకరం. సరిగ్గా ఆ సమయంలోనే సరోజిని గది తలుపు తీసుకొని బయటకొచ్చింది. లీలగా కనిపిస్తున్న మనిషిని చూసి, కంపితస్వరంతో—"ఎవరక్కడ ?" అంది బిగ్గరగానే !

"నేనే సరూ !" అన్నాడు శంకరం.

ఆవిడ మరింత దగ్గరగా వచ్చింది. భర్తేగాకుండా, ఆ ప్రక్కగానేవున్న వరుణను కూడా బాగా గుర్తుపట్టి,—దీర్ఘంగా నిట్టూర్చి "వూ!" అని మరోమాట లేకుండా గదిలోకి వెళ్లిపోయింది.

ఆ వెనుకనే శంకరం కూడా వెళ్లిపోయాడు.

వరుణకు ఒక్క క్షణం వున్న మతి కాస్తా పోయినట్లయింది. తన కాళ్ల క్రింద భూమే దొలుచుకుపోతున్నట్లుగా వుంది. అర్థంకాని అవ్యక్త స్థితిలో యాంత్రికంగానే వచ్చి తన గదిలో మంచంమీద పడుకుంది. అవతల శంకరం గదితలుపులు మామూలుకంటే విసురుగా గడియపడడం చెవులారా విన్నది. అసలే గాయపడ్డ మనసు, దానిపైన ఈ బల్లెంపోటు !

సాంఘికంగా తన కీ కుటుంబంలో వున్న గౌరవనీయమైన అంతస్తులో రేపు మామూలుగా నిలబడే ధైర్యం ఆమెలో క్రమేపీ సన్నగిలిపోతున్నది. అసలే సరోజిని మొదట్నుంచీ అదోవిధంగా చూస్తుంది. దానికి సాక్షిగా ఆమె ఈ రాత్రి కళ్లారా చూసింది. కాని పాప—పుణ్యాలనేవి ఆ సర్వాంతర్యామికే తెలుసు. తన సచ్చరిత్రను రుజువుచేసుకోవడానికి తనదగ్గర ఆధారాలు లేవు. తన అసచ్చరిత్రను రుజువుచేసేందుకు సరోజినికి ఈ ఆధారం చాలు. పదుగురాడేమాటే—పృథ్వీమీద సత్యమైతే—రేపు తన మాట కంటే—నిజమైన అబద్ధం—ఇంకేదీ వుండబోదు. ఈ ఆలోచనలతో ఆమె అసలు కన్ను మూయ్యలేదు. ఆరాత్రి—వరుణ చేంతాడుతో ఉరిపోసుకొని చనిపోయింది. అట్లా చనిపోవడానికి కారణా లేమిటో—ఇతరు లెవ్వరికీ తెలియవు, ఒక్క సరోజినీ శంకరానికి తప్ప ! కాని వాళ్లిద్దరు పెదవి విప్పి ఈనాటికీ—ఒక్క మాట చెప్పలేదు. ★